

మొగాళ్ళంటే ఎందుక్కల్గిందో, ఎలాక్కల్గిందో కాని చాలా చవక అభిప్రాయం ఏర్పడిపోయింది స్వర్ణకి. ఆ అభిప్రాయం రాను రాను రైల్వే యాక్సిడెంట్లలా బలపడిపోయింది గాని తగ్గలేదు. ఇటీవల తనని పెళ్ళాడేస్తానంటూ వచ్చే మొగాళ్ళని చూసింతర్వాత ఆఅభిప్రాయం అలా వ్రేళ్ళు పాతుకుపోయింది. హఠాత్తుగా సంవత్సరం క్రితం తండ్రి చనిపోవడంతో కొన్ని లక్షల రూపాయల ఆస్తికి అధికారిణి అయిపోయిందామె.తల్లి చిన్నప్పుడే లేకుండాపోయింది. ఇక ఆ వూరంత మేడలో తనూ, బామ్మా, వంటవాడూ, మేడమీద వో మూలగదిలో వుంటున్న సారథి అనే కుర్రాడూ తప్పితే మరో హా పురుగ్గూడా లేదు. (ఎంచేతంటే మేడంతా మలేరియా డిపార్టుమెంటు వాళ్ళు డి. డి. టి. కొట్టేశారు.) ఈ సంవత్సరమే బి. ఏ. కంప్లీటుచేసి, ఆ టెక్స్టు పుస్తకాలు విసిరి అవతల పారేసి, వో రోజు వో కుర్చీలో, వో ఫోజులో కూచొని తరువాతేంజేయాలా అని ఆలోచిస్తున్న స్వర్ణకి వాళ్ళ బామ్మ సలహా ఇచ్చింది మారేజ్జేసుకోమని. పైగా స్వర్ణకి మారేజయితే చూడాలని తనకెంతో ఇదిగా వుందని చాలా ఇదిగా చెప్పింది. సరేనంది స్వర్ణ బామ్మ మీద దయ తలచి...... అక్కడితో కథ మొదలయింది, బామ్మ తనకు తెలిసిన అనేక మందికి టెలిగ్రాముల్లాంటి ఉత్తరాలు వ్రాసి పారేసింది. మా స్వర్ణ నేజేసుకోడానికి ఫారిన్ పోయిన ఇండియా కుర్రాళ్ళుగాని, ఇండియాతోనేవున్న ఫారినర్ లాంటి కుర్రాళ్ళుగానీ తమ భూతద్దంలో కనబడితే ఇక్కడికి డైరెక్టు చేయవలసిందంటూ. అలా వ్రాసిన రెండోరోజున ప్రొద్దున్నే నిమిది గంటలకల్లా వో టాక్సీని సరాసరి ఆ మేడ మెట్లు కానేట్లు ఆపించి అందులోంచి దిగాడో పెద్ద మనిషి. అతని వెనుకాతే వో ఫారినర్ లాంటి ఆంధ్రదేశపు తెలుగు చిన్నాడొహతను దిగాడు. వాళ్ళని చూడగానే బామ్మ పరుగెత్తు కొచ్చింది.

"ఏరా! రాజీ! బావున్నావా?..... ఈ చిరంజీవెవరు?" అంది బామ్మ ముచ్చటపడిపోతూ.

"హరినీ!..... వీడినే మర్చిపోయావుటే! విస్సిగాడే!....... మన బెజవాడ రాధమ్మ కొడుకు......,"

"నా తెలివి ప్రొద్దుగూకనూ! విస్సిగాడా..... చాలా ఎదిగి పోయాడుస్మీ!" అంది నోరు తెరచి బజార్లో వస్తువుల ధరలను గుర్తుతెచ్చుకొంటూ!

"పెదనానా! వ్వాట్ షి ఈస్ టెల్లింగ్!"అన్నాడా ఫారిన్ చిన్నాడు పెద్దమనిషితో!

బామ్మ ఆ చిన్నాడిమాటలు, ఎలక్షన్లో వాగ్దానాల్లా అర్థంకాక తెల్లబోయింది.

"మరేంలేదు బామ్మా! వీడూ రెణ్ణెళ్ళ నుంచీ ఫారిన్‌లో వుండిపోడం మూలాన తెలుగు మర్చిపోయాడు. అంచేత గుర్తొచ్చింతవరకూ తెలుగూ, మిగతాదంతా ఇంగ్లీషూ రెండూ కలిపి ఇంగ్లీషులా మాట్లాడుతూంటాడు.!"

ఆ తరువాత వాళ్ళిద్దరినీ వో గదిలోకి సర్ది స్వర్ణ దగ్గరకు పోయి "నిన్నూజ్జడానికి ఫారిన్ చిన్నాడొచ్చాడంది" బామ్మ.

"అయితే ఆ చిన్నాడితో నేను మాట్లాడాలి!" అంది స్వర్ణ.

"హవ్వ!..,..." అని నోరు నొక్కుకోబోయి బుగ్గలు అదివరకే లోపలకు నొక్కుబోయి వుండటం చేత వూరుకొంది.

ఆ సాయంత్రం ఫారిన్ చిన్నాడు వో పెద్దహాల్లో గోడలకున్న తైలవర్ణ చిత్రాలు చూస్తూంటే చప్పుడు గాకుండా లోపలికొచ్చి "హల్లో!" అంది స్వర్ణ.

"హలో! ఇహిహి........" అన్నాడతను.

మిత్రం చూస్తూ వ్యంగ్యంగా అందామె.

కాఫీ హోటల్లో రెండోసారి పొయ్యి మీద పెట్టిన డికాషన్‌లా ఉడికిపోయాడు సారథి. "అక్కడే మీరు చాలా పొరబాటు పడుతున్నారు. ముమ్మూర్తులా కాయలు తిన్నట్లు మీరు అనవసరంగా భుజాలు తడుముకొంటున్నారేమో...... ఎందు కంటే..........."

"వాళ్ళు టయిమయింది!" అందామె విసుగ్గా వాచీ చూసుకొంటూ.

"వెళ్ళిరండి!" అన్నాడతను.

కాని ఆమె వెళ్ళలేదు. నో విముఖమాగి "మీరు ఏదో ఇంటర్వ్యూకి వెళ్ళాలను కొంటూ"నంది.

"అవును. కాని వెళ్ళ దలచుకోలేదు."

"ఎందుకనో అడగొచ్చా?"

"క్షమించండి. స్వవిషయం!"

"ఓహో!" అందామె అతని స్వవిషయం అటూ ఇటూ పోతుందని తనిప్పుడే గుర్తించినట్లు.

"ఒకవేళ డబ్బులేక మానేశారేమో అను కొన్నాను!"

ఉక్కిరి బిక్కి రయ్యాడతను.

"అయితే అవ్వచ్చు!" పెళ్ళయి రెండ్రోజులయి పోయిన అమ్మాయిలా గడుసుగా జవాబిచ్చాడతను.

"దాన్ని గురించి మాటెయ్యడ మెందుకూ?...... వద్దనుకోచ్చు కదా?"

"చెప్పానుగదా! స్వవిషయం!"

"హు!" అని కోపంగా అక్కడి నుంచి విసవిసా వెళ్ళిపోయిందామె.

తనని కూడా అందరిలా జమకట్టి మాట్లాడు తామను కొంది పాపం! అనుకొన్నాడు సారథి ఇంకో

# వెచ్చని కన్నీరు

సిగరెట్టు వెలిగించుకొని కుర్చీలో కూర్చుంటుండ గానే స్వర్ణ స్నేహితురాలు భారతి అక్కడకు వచ్చే సింది.

"నమస్తే!" అన్నాడు సారథి.

"నమస్తే! స్వర్ణ ఇక్కడలేదా?" లేదని తెలు స్తుంటే అడిగింది.

"ఇప్పుడే వెళ్ళిపోయిందండీ! అయిదు నిమిషాలవు తోంది. బహుశా మీకోసమే అయ్యుండొచ్చు...."

"అవును..... వస్తుందో రాదోనని...... నేనే బయల్దేరేను......" ఆమె వెళ్ళలేదు. గదంతా కలియచూస్తోంది.

"కూర్చోండి!" అన్నాడతను కుర్చీ చూపిస్తూ. కూర్చుందామె.

కొద్ది క్షణాలు నిశ్శబ్దం.

"మీ రెప్పుడూ సీరియస్‌గా వుంటారెందుకూ!' మౌనాన్ని నవ్వేశాడతను. "బావుందండీ మీ ప్రశ్న. ఎప్పుడూ నవ్వుతూండటానికి నేను టూత్ పేస్టు కంపెనీ ఎడ్వర్‌టయిజుమెంట్‌ననుకొన్నారా?"

"ఒహ్హో!........ నేననేదదికాదండీ!..... .. ఎప్పుడూ ఏదో విషయం ఆలోచిస్తున్నట్లు వుంటారు."

"......................." ఆధునిక పెళ్ళికొడు కులా తలవంచుకొన్నా డతను.

"సారీలెండి! చెప్పకూడందయితే..... బలవంతం లేదు!"

"ఉహు! అదేంకాదు." అని కాసేపాగాడతను "ఇన్నాళ్ళూ జరిగిన జీవితం గురించి ఆలోచిస్తూ

ఉండేవాణ్ణి. ఇప్పుడు భవిష్యత్తు గురించి ఆలో చిస్తున్నాను."

"బస్! భవిష్యత్తులో ఎంతదూరం వరకూ ప్రయాణం చేస్తుంటారు?......" చిలిపిగా అడిగిం దామె.

"నో!నో! ఊహాగానాలు చేయటంలేదు..... ఎప్పుడు ఈ ఇంట్లోంచి బయటపడి స్వతంత్రంగా బ్రతుకుదామా అని........." హఠాత్తుగా ఆగి పోయాడతను.

భారతి ఆశ్చర్యంగా అతని వంక చూస్తోంది.

"ప్లీజ్! పొరపాటయింది...... ఈ మాటలేవీ స్వర్ణ దగ్గర అనకండి!" బ్రతిమాలుతున్నట్లు చూశాడతను.

రోడ్డుమీద ఆర్‌టిసీ బస్సు గుండె అదిరేట్టు రొద చేసుకొంటూ పోయింది. చుట్టు ప్రక్కల ఏ ఇంట్లోనయినా బ్లడ్ ప్రెషర్ పేషెంటుంటే తక్కువ చచ్చిపోతాడావేళతకి.

కొద్ది క్షణాలాగి అతనే అన్నాడు మళ్ళీ "మీకు నా గురించేమీ తెలిసుండదు..... నిజానికి ఈ ఇంటికీ నాకూ ఏవీ సంబంధం లేదు..... ఇప్పటికే స్వర్ణగారికి చాలా ఋణపడిపోయాను..... ప్రస్తుతం ఉద్యోగంకోసం ప్రయత్నిస్తున్నాను..."

"మీ కభ్యంతరం లేపోతే...... రేపోసారి మా యింటికి రండి! మా నాన్నగారి నడుగుదాము. ఆయనేమయినా ఉద్యోగం ఇప్పించగలరేమో!"

అనుకోకుండా లభించిన చేయూతకి కొద్దిగా తంగారు పడ్డాడతను.

"మీకు శ్రమ ఇస్తున్నానేమో!"

"భలేవారే మీరు.....నిజంగానే శ్రమ ఇచ్చి నట్లు మాట్లాడేస్తున్నారు."

"క్షమించండి...... మీకు 'ఆఫర్' చెయ్య డానికి 'టీ' కూడా లేదు......"

"చాలా పెద్దనేరం చేస్తున్నారు పాపం!"

ఇద్దరూ నవ్వేశారు.

"రేపుదయం వస్తారు గదూ!" అంటూ లేచి నుంచుందామె.

"నో! తప్పక వస్తాను......" అన్నాడు సారథి ఉత్సాహంగా.

ఈ సంఘటన జరిగిన రెండ్రోజుల తర్వాత సారథి డైనింగ్‌హాల్లో భోజనం చేస్తూంటే రుస రుసలాడుతూ, తెలుగు సినిమా చివరికంటా చూసిన ప్రేక్షకురాలిలా, కోపంగా వచ్చి అతని ప్రక్కన నిల బడింది స్వర్ణ. భారతికీ స్వర్ణకీ ప్రాణాలు ఇచ్చు కొనే స్నేహం లేకపోయినా, మనసులో మాట దాచుకోలేనంత స్నేహముంది. తనకీ సారథికీ జరిగిన సంభాషణ భారతి అంత క్రితంరోజే స్వర్ణ చెవి నేసింది. సారథి ఉద్యోగంకోసం తన తండ్రిని కలుసు కోడమూ..... ఆయన నాల్రోజులాగమన్జెప్పిన వైనమూ...... అంతా వివరంగా చెప్పింది. వాళ్ళ సంభాషణ భారతి ఉన్నదున్నట్లు చెప్పడం చేత, స్వర్ణకి అందులో కొన్ని చాలా అభ్యంతరకరంగా అనిపించింది. ముఖ్యంగా "క్షమించండి! మీకు ఆఫర్ చెయ్యడానికి 'టీ' కూడా లేదు." అని సారథి అనటం...... "చాలా పెద్దనేరం చేస్తున్నారు పాపం!' అని భారతి (తన స్నేహితురాలయినాసరే) అనడం...... తరువాత ఇద్దరూ నవ్వడం.... ఇటు





హెడన్సా
మూల వ్యాధులకు.
ప్రతి చోట దొరకును

## క్లియరెన్స్ అమ్మకం

నవీన, అందమైన డిజైనులలో, రంగులలో కాశ్మీర్ బ్యూటీ ఆర్ట్స్ చీరలు, పెద్ద సైజు స్పెషల్ డీలక్సు ఒకటి రు. 10/- రెండు రు. 19/- మూడు రు. 27/- నాలుగు రు. 35/- ఒకే పార్శిల్‌లో రెండు లేక ఎక్కువ చీరలు కొనువారికి బ్లౌజ్‌పీసు మరియు ఒకజత ఇయిర్ టాప్స్ ఉచితం. స్టాకు పరిమితం. ఆర్డరు వెంటనే పంపండి. అడ్రసు యింగ్లీషులో వ్రాయండి.



L. D. AHUJA & SONS (WAP)
Post Box No. 1346 Delhi-6.

## తెల్ల మచ్చలకు ఉచిత వైద్యము

శక్తివంతమైన మా ఆయుర్వేద ఔషధము "Swetari" తెల్ల మచ్చలను కొద్ది రోజులలో తొలగించును. సాంఘిక సంక్షేమం కొరకు 1000 రోగులకు ఒక్కొక్క పాకెట్ ఉచితంగా యివ్వబడును. వెంటనే వ్రాయండి.

Sri Krishna Chandra Vaidya
(A. P.) P. O. Katrisarai (Gaya)

## 35 ఎం. ఎం. హోమ్ సినీ ప్రొజెక్టర్

మీ యింటిలోనే సినిమా చూచి ఆనందించండి. మీరు కోరిన చిత్రమును మీ గదిలో తెరమీద టార్చి లేక



ఎలెక్ట్రిసిటీ సహాయంతో చూడవచ్చును. సినిమాలోవలె పూర్తి సైజు చిత్రముల కథ,నాట్యం చూడవచ్చును. స్లైడ్స్‌కూడ ప్రదర్శించవచ్చును. ధర: రు22—50.
వి.పి.చార్జి రు4—50; 20 అ॥ ఫిలిం [illegible] గజం2[illegible] స్క్రీన్ [illegible] రు. 4

JAPAN AGENCIES (WAPT-27)
Beat No. 13. Aligarh.

# వెచ్చని కన్నీరు

వంటి సంభాషణలు సాధారణంగా తెలుగుసినిమాల్లో ప్రేమికులనుకోడం ఆమెకి గుర్తు.

"అంత అభిమానం వున్నోళ్ళు..... నా స్నేహితురాలినెందుకు అడగాల్సొచ్చింది ఉద్యోగం?" తీవ్రంగా ఉందామె గొంతు.

తెల్లబోయి వెంటనే తేరుకొన్నాడతను.

"నే నడగలేదు....... ఆవిడే......."

"పిలిచి ఇస్తోందన్నమాట!........"

కోపంగా ఆమెవంక చూశాడు సారథి.

"మీరేం అడగదల్చుకొన్నారో నా కర్థం కావడం లేదు.........."

"ఉద్యోగం కావాలని నన్నే ఎందుకడగరాదూ?"

"పొరపాటు పడుతున్నారు..... నేనెవర్నీ అడగలేదు".

"ఎందుకని?"

"నాకిష్టంలేదు .. ఒకళ్ళనడగడం......."

"మీయింట్లో వుండడం..... మీయింట్లోనే భోజనం చేయడం...... ఇవన్నీ ఇష్టమేనా?"

హఠాత్తుగా లేచినుంచున్నాడు సారథి.

"స్వర్ణా! మీరింకేమీ మాట్లాడవద్దు..... తప్పయింది...... ఒప్పుకొంటున్నాను. మీరు నాకు చాలా సహాయం చేశారు..... ఎప్పటికయినా మీ ఋణం తీర్చుకొంటాను...... వస్తాను..... ఇవాళే మీనుంచి సెలవు తీసుకొంటాను......" కంచంలో చెయ్యి కడిగేసి వడివడిగా వెళ్ళిపోయాడతను.

స్వర్ణ ఆవేశం చల్లబడిపోయింది.

ఏమనాలో తెలియక అలాగే చూస్తూ నుంచుండిపోయింది.

మరో గంటలో రెండు పెట్టెలు, ఓ బెడ్డింగ్ రిక్షాలో సర్ది ఆమె గదిలోకి వచ్చాడతను.

"నేను వెళ్తున్నాను..... మీకు నావల్ల ఏమయినా కష్టం కలిగివుంటే క్షమించండి...... నమస్తే!"

ఆమెకి పిచ్చెక్కిపోయేట్టుంది. అతనెందుకిలా చేస్తున్నాడు. తను ఆవేశంలో ఏదో అంటే పట్టించుకోవాలా?....... ఇలా వెళ్ళిపోతే తను వద్దని బ్రతిమాలుతుందనుకొన్నాడేమో!...... తన కంఠంలో ప్రాణం వుండగా అలా జరుగదు.....

ఆమె ఏమీ మాట్లాడలేదు...... కనీసం అతని వంక చూడనూలేదు........

వెళ్ళిపోయాడు సారథి.

బామ్మగారు ఇదంతా చూస్తూనే వుంది..... కాని స్వర్ణంటే, ఆమె కోపమంటే, భయం ఆవిడకి. అంచేత సారథి "వెళ్తున్నామ్మగారూ!" అన్నప్పుడు కూడా మౌనంగా కన్నీరు తుడుచుకొని వూరుకుండిపోయింది.

సారథి వెళ్ళిపోయిన దగ్గర్నుంచీ స్వర్ణ ఏదో గిల్టీగా ఫీలవుతోంది. ఆ పూటయితే అసలు భోజనమే చెయ్య బుద్ధికాలేదు. వంటవాడొచ్చి "భోజనం వడ్డించమంటారా?" అనడిగితే లోపలికి పోయి ఆ నెలజీతం తెచ్చి వాడిచేతిలో పెట్టి "గెటవుట్" అంది. వాడదిరిపోయి "పొరపాటయింది బాబోయ్. ఇంకెప్పుడూ అలా అడగనని" మొర్రోమంటే వరే పోయి పడుకోమంది.

సాయంత్రం క్లబ్‌కి వెళ్ళబోతూంటే తలుపులు బార్లా తెరచివున్న సారథి గది బోసిగా కనిపించింది. రోజూ ఈ టయిముకి సారథి..... ఆ కిటికీముందు కుర్చీలో కూర్చొని..... ఏవో చిత్రాలు గీస్తూండేవాడు...... అనుకోకుండానే గదిలోకి నడిచిందామె.. గోడకి వ్రేలాడుతూ అతని ఫోటో ఒకటి మిగిలిపోయింది. ఆ ఫోటోవంకే చూసిందామె. అందమయిన మొఖం. విశాలమయిన నుదురు..... మరి కాసేపు చూడాలనిపించిందికాని చూడలేదు.

సారథికావెళ్ళిపోయి రెండ్రోజులయింది. "ఎక్కడున్నాడో? ఏం చేస్తున్నాడో? పాపం దగ్గర డబ్బు కూడా ఎక్కువలేదు....." అనుకొంటూంది స్వర్ణ. హఠాత్తుగా ఆమెకో అనుమానం మొలచింది. "భారతిద్వారా ఉద్యోగం సంపాదించాడేమో....."

వెంటనే ఫలానా కారణం అని తెలియకుండానే 'ఈర్ష్య' అనే పదార్థం మొలకెత్తిందామెలో.

తనూ సారథితో ఆ రోజు చాలా అనుచితంగా ప్రవర్తించినట్లనిపించిం దామెకి. ఎదుటి వాళ్ళని తనకంటే తక్కువగా చూడటం, వాళ్ళు బాధ పడుతూంటే తను ఆనందించటం..... అలవాటయిపోయింది తనకి. ఆ అలవాటుకి అనేకసార్లు సారథిని నిర్దాక్షిణ్యంగా గురి చేసింది.

ఆలోచిస్తూంటే ఆమెకు తెలీకుండానే కన్నీళ్ళు కారిపోయినయి. కన్నీళ్ళు గుండెలకి వెచ్చగా తగిలినప్పుడు ఉలిక్కిపడి తెలుసుకుందామె..... అరె..... తనేడుస్తూంది..... అదీ సారథి గురించి..... ఎందుకు..... అతను లేపోతే తను జీవించలేదా?.... ఒకవేళ......... ఒకవేళ....... తనతనిని ప్రేమించిందా?..................

వూరి చివర నో పెంకుటింట్లో తన గదిలో కూర్చున్న సారథి ఇద్దరు మనుష్యులు లోనికి వచ్చి తన సామాను బయటకు మోసేస్తుంటే చూసి అదిరిపోయాడు. "పట్టపగలు దోపిడీలు చేసే గజదొంగల్లా వున్నారే" అనుకొని......

"ఏయ్! ఎక్కడికి సామాను?" గట్టిగా అరిచాడతను.

"అమ్మగారి నడగండి!" అందులో ఒకాడన్నాడు.

ఒక్క ఉదుటున గదిలోనుంచి బయటకు వచ్చాడు సారథి.

స్వర్ణ వసారాలో నుంచొని ఇల్లంతా కలియ చూస్తోంది.

"మీరన్నమాట! ఏమిటీ దౌర్జన్యం?"

స్వర్ణకి మళ్ళీ కోపం వచ్చేసింది. మొఖం ఎర్రబడిపోయింది.

"ఏం? ఈ యింటికంటే తీసిపోయిందా మా యిల్లు. పూహు! మీరిక్కడుంటానికి సిగ్గులేదూ పదండి!" అంది కటువుగా.

"నేను రాదలచుకోలేదు!"

"ఎలారారో నేనూ చూస్తాను. వాళ్ళిద్దరూ ఆ సామానుతోసహా మిమ్మల్నీ కారులో పడేస్తారు."

హఠాత్తుగా అతనిచేయి పట్టుకొని కారు దగ్గరకు లాక్కుపోయిందామె.

ఆమె చొరవకు విస్తుపోతున్నాడతను.

వెనుకసీట్లో అతని ప్రక్కనే కూర్చొని కారు స్టార్టవగానే అతని గుండెలమీదకి ఒరిగిపోయి "ఏం? మీరులేందే నేనొక్కర్తెని ఎలా వుండగలననుకొన్నారు?........ రేపు మన మారేజి అయినా ఇలాగే పోట్లాడి వెళ్ళిపోతాంటారా?......"

ఆమె చేతిని అందుకొని ఆప్యాయంగా తన పెదాలకు హత్తుకొన్నాడు సారథి. ●